teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

## జేఈఈ మెయిన్స్‌లో “తెలుగు విద్యార్థుల ప్రభంజనం”

ముగ్గురికి 100 పర్సెంటైల్

త్వరలోనే ఆర్కిటెక్చర్ ఫలితాలు



5

ములుగు | సంపుటి : 04 | సంచిక : 223 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 17 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.



## తెలంగాణలో 2027 జనగణన నగారా

డిజిటల్ విధానంలో నిర్వహణకు సన్నాహాలు

రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ భేటీ

సి.ఎస్. రామకృష్ణరావు అధ్యక్షతన కీలక సమావేశం

మొదటి దశలో 90,000 మంది ప్రభుత్వ ఉద్యోగుల వినియోగం

.. వివరాలు 2లో




## గీతం యూనివర్సిటీకి సుప్రీంకోర్టు షాక్

రూ. 15 కోట్లు డిపాజిట్ చేయాలని ఆదేశం

నాలుగు వారాల్లో జమ చేయాలని న్యాయస్థానం స్పష్టం

రూ. 118 కోట్ల బకాయిలపై కొనసాగుతున్న పోరాటం

గీతం యూనివర్సిటీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. 4వారాల్లో రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని ఆదేశించింది. విద్యుత్ బకాయిల కేసులో తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం కోర్టు స్పందించింది.

.. వివరాలు 2లో




## ఫాస్టాగ్ వినియోగదారులకు ఎన్‌హెచ్‌ఏఐ హెచ్చరిక




వార్షిక పాస్‌ల పేరుతో కొత్త సైబర్ స్కామ్

రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను మాత్రమే వాడాలని విజ్ఞప్తి

దేశవ్యాప్తంగా హైవేలపై టోల్ ప్లాజాల వద్ద సమయాన్ని తగ్గించే లక్ష్యంతో తీసుకోచ్చిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌లలోనూ సైబర్ స్కామ్‌లు మొదలయ్యాయి. నకిలీ ఫాస్టాగ్ వార్షిక పాస్‌ల పేరుతో మోసపూరిత వెబ్‌సైట్‌ల నుంచి ప్రజలను మోసగించే పనులు జరుగుతున్నాయని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారిక ప్రకటనను విడుదల చేసింది.

2

## రైతులకు ప్రభుత్వం సంక్రాంతి కానుక

రూ. 514 కోట్ల సన్నవడ్ల బోనస్ విడుదల





హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): రైతులకు రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం శుభవార్త చెప్పింది. సన్నవడ్ల బోనస్ కోసం నిధులు విడుదల చేసింది. మొత్తం రూ.514.36 కోట్లను సోమవారం విడుదల చేసింది. తెలంగాణలో సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం

మిగతా 2 లో

## న్యాయవాది హత్య కేసులో హెచ్ఆర్సీ సీరియస్

ఘటనపై సమగ్ర నివేదికకు పోలీసు బాస్ కు ఆదేశం

ఫిర్యాదు చేసినా పోలీసులు రక్షణ కల్పించలేదని వెల్లడి




హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): న్యాయవాది జి. స్వప్న కుమారి (34) హత్య కేసులో పోలీసుల తీరుపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. తన ప్రాణాలకు ముప్పు ఉందని మృతురాలు ముందుగానే హెచ్చరించినప్పటికీ, మొయినాబాద్ పోలీసులు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారన్న

మిగతా 2 లో

## కాంగ్రెస్, బీజేపీలది ఫెవికాల్ బంధం



మున్సిపల్ ఫలితాలపై హరీశ్ రావు నిప్పులు

ఢిల్లీలో కొట్లుకుంటూ గల్లీలో చేతులు కలిపాయని విమర్శ

చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను పంచుకున్నాయని ఆరోపణ

05

## హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ గురి

- ఎనిమిది పట్టణాలకు ఇన్‌చార్జులుగా సీనియర్ నేతలు
- దొంగ ఓట్లతో పదవులు పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ
- పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి




హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): హంగ్ వచ్చిన మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ ఫోకస్ చేసింది. ఎనిమిది పట్టణాలకు సీనియర్ నేతలను ఇన్‌చార్జులుగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. హంగ్ వచ్చిన ఆ ఎనిమిది ప్రాంతాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక నేతలతో

మిగతా 5 లో

## అట్టహాసంగా హైదరాబాద్‌లో బయో ఏషియా

- సదస్సును ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఫిబ్రవరి 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహణ

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరగబోయే బయోఏషియా–2026 సదస్సు ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనుంది. ఈ ప్రపంచ స్థాయి సదస్సు ప్రధానంగా ‘టెక్‌బయో అన్‌లీష్డ్ – ఏఐ, ఆటోమేషన్



మిగతా 5 లో

## మంత్రి పదవిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యూటర్న్



ఘాటు వ్యాఖ్యల నుండి వెనక్కి తగ్గిన ఎమ్మెల్యే

పదవుల కంటే మునుగోడు అభివృద్ధే ముఖ్యం

అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని విన్నపం


## భారత్ వేదికగా ఏఐ విప్లవం

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ను ప్రారంభించిన ప్రధాని

దేశ రాజధానిలో ఐదు రోజుల అంతర్జాతీయ సదస్సు

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): కృత్రిమ మేధ రంగంలో ప్రపంచాన్ని శాసించే దిశగా భారత్ మరో కీలక అడుగు వేసింది. దేశ రాజధానిలోని భారత్ మండపంలో ఐదు రోజుల పాటు జరిగే ‘ఇండియా–ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026’ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రధానమంత్రి

మిగతా 5 లో



# ఆపరేషన్ చాణక్య మాస్టర్ స్ట్రోక్

## మున్సిపల్ ఎన్నికల్లో అంచనాలు అక్షరాలా నిజం

### క్షేత్రస్థాయి విశ్లేషణలో తిరుగులేని ఆధిపత్యం

### 2982 వార్డు ఫలితాలను కచ్చితత్వంతో విశ్లేషించిన సేఫాలజిస్ట్ బృందం


### సంస్థ పనితీరుపై సర్వత్రా హర్షం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన మున్సిపల్ మరియు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో 'ఆపరేషన్ చాణక్య' సంస్థ యొక్క సర్వే అంచనాలు అక్షరాలా నిజమయ్యాయి. మొత్తం 2982 వార్డు మరియు డివిజన్లలో జరిగిన ఈ ఎన్నికల సరళిని అత్యంత కచ్చితత్వంతో అంచనా వేసి, ఈ సంస్థ రాజకీయ వర్గాల్లో తన ప్రత్యేకతను చాటుకుంది.

రాష్ట్ర ఇంచార్జ్ మరియు నేషనల్ జనరల్ సెక్రెటరీ దత్తాత్రేయ రాజేందర్, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఉ సేఫాలజిస్ట్ సాయిని రాజా శ్రీనాథ్ రావు సారథ్యంలో జరిగిన ఈ సర్వే రిపోర్ట్‌పై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

**రిపోర్ట్ కీలక అంశాలు:**

కాంగ్రెస్ హవా: చాణక్య అంచనా వేసిన దానికంటే కాంగ్రెస్ పార్టీ అధికంగా 1537 సీట్లు సాధించి ప్రభంజనం సృష్టించింది.




అంచనాలను వివరించే గ్రాఫికల్ చార్ట్

| రాజకీయ పార్టీ | చాణక్య అంచనా (సీట్లు) | వాస్తవ ఫలితం (సీట్లు) | విశ్లేషణ |
|---|---|---|---|
| కాంగ్రెస్ (INC) | 1400 - 1449 | 1537 | అంచనా కంటే మెరుగైన ప్రదర్శన |
| బిఆర్ఎస్ (BRS) | 745 - 793 | 781 | ఖచ్చితమైన అంచనా |
| బిజెపి (BJP) | 358 - 399 | 336 | స్వల్ప తేడాతో అంచనాకు సమీపంలో |
| ఇతరులు (MIM/JSP/Others) | 341 (మొత్తంగా) | 341 | వంద శాతం ఖచ్చితత్వం |

**అంచనాలు వర్సెస్ వాస్తవ ఫలితాలు**

ఆపరేషన్ చాణక్య అందించిన అంచనాలకు మరియు వెలువడిన తుది ఫలితాలకు మధ్య ఉన్న పోలికలను ఇక్కడి పట్టికల్లో చూడవచ్చు.

| పార్టీ పేరు | గెలుచుకున్న సీట్లు | విజయ శాతం (సుమారుగా) | స్థితిగతులు |
|---|---|---|---|
| కాంగ్రెస్ (INC) | 1537 | 51.5% | పూర్తి ఆధిక్యం |
| బిఆర్ఎస్ (BRS) | 781 | 26.2% | ప్రధాన ప్రతిపక్షంగా నిలకడైన ప్రదర్శన. |
| బిజెపి (BJP) | 336 | 11.3% | పట్టణ ప్రాంతాల్లో ఉనికిని చాటుకుంది. |
| ఇతరులు (MIM/JSP/Ind) | 328 | 11.0% | నిర్ణయాత్మక శక్తిగా అవతరించారు. |

పార్టీల వారీగా విజయాల శాతం

నిపుణుల ప్రశంసలు: సంస్థ యొక్క రిపోర్ట్ పక్కాగా ఉండటంతో ఎంతోమంది సేఫాలజిస్టులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు మరియు మంత్రులు ఆపరేషన్ చాణక్య టీంను అభినందించారు.

**భవిష్యత్ ప్రణాళిక:**

ఈ విజయంతో ఉత్సాహంగా ఉన్న సంస్థ, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మరియు ఇతర ఎన్నికల్లో కూడా తమను నమ్ముకున్న పార్టీలకు అత్యంత కచ్చితమైన స్ట్రాటజీలను, రిపోర్టులను అందిస్తామని ప్రకటించింది.

ఈ అద్భుతమైన విజయాన్ని సాధించిన టీం లీడర్స్ అందరికీ దత్తాత్రేయ రాజేందర్ మరియు సాయిని రాజా శ్రీనాథ్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఫాస్టాగ్ వినియోగదారులకు "ఎన్‌హెచ్ఏఐ హెచ్చరిక"

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా హైవేలపై టోల్ ప్లాజాల వద్ద సమయాన్ని తగ్గించే లక్ష్యంతో తీసుకోచ్చిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌లలోనూ సైబర్ స్కామ్‌లు మొదలయ్యాయి. నకిలీ ఫాస్టాగ్ వార్షిక పాస్‌ల పేరుతో మోసపూరిత వెబ్‌సైట్‌ల నుంచి ప్రజలను మోసగించే పనులు జరుగుతున్నాయని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారిక ప్రకటనను విడుదల చేసింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు అధికారిక ఎన్‌హెచ్ఏఐ పోర్టల్‌లుగా నమ్మించి, నకిలీ పాస్‌ల కోసం చెల్లింపులు చేయాలంటూ కస్టమర్లను మోసగిస్తున్నాయని పలు నివేదికలు వచ్చిన తర్వాత ఎన్‌హెచ్ఏఐ ఈ అలర్ట్‌ను ఇచ్చింది. ఇలాంటి నికిలీ వెబ్‌సైట్లు, లింక్స్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారిక వెబ్‌సైట్‌ల నుంచి మాత్రమే వార్షిక పాస్‌లను కొనుగోలు చేయాలని సూచించింది. వార్షిక పాస్‌ల గురించి సెర్చ్ చేసినప్పుడు టాప్ లిస్ట్‌లో నకిలీ వెబ్‌సైట్ లింకులు వచ్చేలా సైబర్ మోసగాళ్లు చేస్తున్నారు.




ఈ మోసపూరిత సైట్‌లు ప్రొఫెషనల్‌గా కనిపించేలా, చట్టబద్ధమైన ప్రభుత్వ పోర్టల్‌లను పోలి ఉండేలా రూపొందించారు. దీనివల్ల ప్రజలు వాటిని గుర్తించడంలో కష్టమవుతుంది. వాటిని క్లిక్ చేయగానే ఫోన్ నంబర్, వాహన రిజిస్ట్రేషన్ నంబర్ లాంటి వ్యక్తిగత వివరాలు కోరుతాయి. పేమెంట్ గేట్‌వే ద్వారా చేసే చెల్లింపులు నేరుగా సైబర్ మోసగాళ్ల అకౌంట్లకు చేరుతున్నాయి. ఈ మోసాల బారిన పడకుండా కస్టమర్లు ఎన్‌హెచ్ఏఐ అధికారిక వెబ్‌సైట్ లేదా రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో మాత్రమే వార్షిక ఫాస్టాగ్ పాస్‌లను కొనుగోలు చేయాలని వెల్లడించింది.

# రైతులకు ప్రభుత్వం సంక్రాంతి కానుక

మొదటి పేజీ తరువాయి



తెలిసిందే. వానాకాలంలో సన్నవడ్లు అమ్మిన 2.17 లక్షల మంది రైతులకు బోనస్ బకాయిలు విడుదల చేసింది. ఈ బోనస్, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అదనంగా లభిస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన 33 రకాల సన్నబియ్యం రకాలను పండించిన రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ధాన్యంలో తేమశాతం, గింజ నాణ్యతను బట్టి ఈ బోనస్ ఖరారు చేస్తారు. గత కొంతకాలంగా బోనస్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసిన రైతులకు ఈ తాజా నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. పంట పెట్టుబడి పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ అదనపు రూ.500 తోడుగా నిలవనుంది.

# న్యాయవాది హత్య కేసులో "హెచ్ఆర్సీ సీరియస్"

మొదటి పేజీ తరువాయి

ఆరోపణల నేపథ్యంలో, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర డీజీపీని కమిషన్ ఆదేశించింది. ఈ నెల 4వ తేదీన చేవెళ్ల పరిధిలో జరిగిన భూ వివాదంలో న్యాయవాది జి. స్వప్న కుమారి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే, ఈ హత్యను నివారించడంలో పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహించారని ఆరోపిస్తూ 163 మంది న్యాయవాదులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు.

**ముందే ఫిర్యాదు చేసినా**

తన సోదరుడి నుంచే తనకు ప్రాణహాని ఉందని స్వప్న కుమారి పోలీసులకు ముందే ఫిర్యాదు చేసినా, వారు సకాలంలో నివారణ చర్యలు తీసుకోలేదని, ఇది విధి నిర్వహణలో తీవ్ర అలసత్వమని న్యాయవాదులు తమ ఫిర్యాదులో (ఎస్.ఆర్. నం. 515/2026) పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న టీజీహెచ్ఆర్సీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్, ఘటనపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను అందజేయాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను మార్చి 6కి వాయిదా వేశారు.

# తెలంగాణలో 2027 జనగణన నగారా


హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): సచివాలయంలో ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి జనగణన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2027 జనగణనకు రాష్ట్రంలో సమగ్ర ఏర్పాట్లు ప్రారంభించడానికి చర్చలు జరిగాయి. రాష్ట్రంలో జనగణనను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించడం ఈసారి ప్రత్యేకత అని అధికారులు పేర్కొన్నారు. జిల్లాల స్థాయి సన్నద్ధత కోసం త్వరలో కలెక్టర్ల సమావేశాలు నిర్వహించనున్నారు. శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యమని ప్రధాన కార్యదర్శి సూచించారు.

అవసరమైన ఉద్యోగుల సంఖ్యపై అంచనా సిద్ధం చేయాలని, డిజిటల్ సర్వేలో స్లమ్ ప్రాంతాలు, దూర ప్రాంతాలు మిస్ కాకుండా పూర్తి కవరేజ్‌ని కల్పించాలని అధికారులు ఆదేశించారు. సిబ్బందికి నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. మొదటి దశలో సుమారు 90,000 ప్రభుత్వ ఉద్యోగులను ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుగా నియమించనున్నారు. సమావేశంలో పలువురు ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గీతం యూనివర్సిటీకి సుప్రీంకోర్టు షాక్

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): గీతం యూనివర్సిటీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. 4వారాల్లో రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని ఆదేశించింది. విద్యుత్ బకాయిల కేసులో తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం కోర్టు స్పందించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలను గీతం యూనివర్సిటీ సుప్రీం కోర్టులో సవాలు చేసింది. వీబీసీ, గీతం వర్సిటీ ఒకటేనని ఎస్పీడీసీ వాదనలు వినిపించాయి. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు డిపాజిట్ చేయాలని స్పష్టం చేసింది. వీబీసీ ఫెర్రో అలాయస్ కంపెనీ విద్యుత్ బకాయిలకు తమకు సంబంధం లేదనిన గీతం యూనివర్శిటీ సుప్రీంలో వాదించింది. అయితే వీబీసీ సంస్థకు, గీతంకు ఉన్న సంబంధాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ నిర్ణయించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. అంతవరకూ నాలుగు వారాల్లో రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని గీతం యూనివర్శిటీకి సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. వీబీసీ సంస్థ నుంచి భూములను కొనుగోలు చేసిన గీతం యూనివర్శిటీ రూ.118 కోట్లు బకాయిలు చెల్లించాలని లేకపోతే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామంటూ ఎస్పీడీసీ నోటీసులు జారీచేసింది. ఈ నోటీసులను గీతం యూర్శిటీ హైకోర్టులో సవాల్ చేసింది. ఈ క్రమంలోనే రూ.54 కోట్లు చెల్లించాలని గీతం యూనివర్శిటీని హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలను గీతం యూనివర్శిటీ సుప్రీంలో సవాలు చేసింది. వీబీసీ, గీతం యూనివర్శిటీ ఒకటేనని ఎస్పిడిసీ వాదించింది. మరొకవైపు వీబీసీ చెల్లించాల్సిన బకాయిలు తమను చెల్లించమనడం చట్ట వ్యతిరేకమని గీతం యూనివర్శిటీ వాదించింది.

# మంత్రి పదవిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యూటర్న్



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): మంత్రి పదవిపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన మంత్రి పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవులు శాశ్వతం కాదు మునుగోడు అభివృద్ధే తన లక్ష్యమన్నారు. తనకు పదవి ఇవ్వకపోయినా పర్వాలేదు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాగా, ఇటీవల మంత్రి పదవిపై రాజగోపాల్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఏకంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని, లేకుంటే సీఎం పోస్టు కోసం ప్రయత్నిస్తానని అన్నారు. మళ్లీ అడగబోను అని నాకూ ఒకరోజు వస్తుందని ఆ రోజు లాక్కుంటానని అన్నారు. దీంతో పాటు పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని సీఎం చేసిన వ్యాఖ్యలపై రాజగోపాల్ రెడ్డి ఘాటుగా స్పందించారు. సీఎం చేసిన వ్యాఖ్య అధిష్టానాన్ని అవమానించడమే అంటూ ఆయన మండిపడ్డారు. సీఎం ఒక్కరే కష్టపడితే కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని, పార్టీలో నేతలంతా శ్రమించారని ఆయన గుర్తుచేశారు.

# మున్సిపల్ చైర్మన్‌గా పావుశెట్టి సునీల్, వైస్ చైర్మన్‌గా ఏకు దివ్య

## పరకాలను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



పరకాల, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): పరకాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో, పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం పరకాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో 13 మంది కౌన్సిలర్లను గెలిపించిన ప్రజల తీర్పుకు తలవంచి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు.

**నూతన పాలకవర్గం ఎన్నిక**

పరకాల మున్సిపల్ చైర్మన్‌గా పావుశెట్టి సునీల్, వైస్ చైర్మన్‌గా ఏకు దివ్య విద్యాసాగర్ ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గం ప్రజలు మెచ్చేలా, పారదర్శకమైన పాలన అందించేందుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. గత రెండు ఏళ్లుగా తాను చేస్తున్న అభివృద్ధి పనులను చూసే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని ఆయన గుర్తు చేశారు.

**అభివృద్ధి ప్రణాళికలు - ముఖ్యాంశాలు:**

పరకాల పట్టణ రూపురేఖలు మార్చేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. నిధుల కేటాయింపు: ఇప్పటికే రూ. 38 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుండగా, మరో రూ. 35 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థ, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. మౌలిక వసతులు: వచ్చే రెండేళ్లలో మంచినీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

విద్య మరియు ఉపాధి: పట్టణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఐటిఐ, టాస్క్, మరియు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు.

క్రీడలు మరియు మార్కెటింగ్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని ఇండోర్ స్టేడియంగా మార్చి, క్రయవిక్రయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



**విపక్షాలపై ధ్వజం**

బిఆర్ఎస్ మరియు బిజెపి నాయకులు కుట్రపూరిత ఆలోచనలతో కాంగ్రెస్ పార్టీని దెబ్బకొట్టాలని చూశారని, కానీ వారి ఆటలు సాగలేదని రేవూరి విమర్శించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

"పరకాల నియోజకవర్గంలో రౌడీయిజాన్ని సహించేది లేదు. చట్టపరంగా ఉక్కుపాదం మోపుతాం. గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన పరకాలను జిల్లా స్థాయిలో అభివృద్ధి చేసి తీరుతా."

– రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యే

మురికివాడల రహిత పట్టణంగా, మోడల్ మున్సిపాలిటీగా పరకాలను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## మున్సిపాలిటీలో సభ్యుల ప్రమాణ స్వీకారం

**చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ సజావుగా పూర్తి**





భూపాలపల్లి, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి మున్సిపాలిటీలో ఎన్నికైన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించబడింది. అనంతరం చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ మరియు సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సాగినట్లు తెలిపారు. ఆర్డిఓ హరికృష్ణ ఎన్నికైన కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు.

ఎన్నికల ప్రక్రియ, చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక ప్రశాంత వాతావరణంలో పూర్తవడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఈడియం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్రీడలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్రీడలు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జెండా ఊపి బస్సు ప్రారంభం

తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ (సమగ్ర శిక్ష) ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కొరకు రాష్ట్రస్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనుటకు జిల్లా విద్యాశాఖ తరఫున బయలుదేరిన విద్యార్థుల బస్సును సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుకుని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనుటకు వివిధ మండలాల నుండి మొత్తం 26 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 7 మంది తల్లిదండ్రులు బయలుదేరారు. జిల్లా తరఫున పాల్గొంటున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా గౌరవాన్ని నిలబెట్టాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ముద్దమల్ల రాజేందర్, జిల్లా సమీకృత విద్య కోఆర్డినేటర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ శ్యామల రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, మరియు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లుదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ చైర్మన్ గా చంద్ర కళ, వైస్ చైర్మన్ గా ఆసియా షాహిన్





ములుగు జిల్లా, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు 20 మంది కౌన్సిలర్ లతో ఆర్డీవో వెంకటేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. 06వ వార్డు కౌన్సిలర్ ములుగు మున్సిపాలిటీ చైర్మన్ గా చింతనిప్పుల చంద్ర కళ, 14 వ వార్డు కౌన్సిలర్ వైస్ చైర్మన్ గా ఆసియా షాహిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎక్స్ అఫిషియో మెంబర్ మరియు పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు గంగాధర్ పర్యవేక్షించారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్ గా రాజు ఎన్నిక



రంగారెడ్డి, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ మున్సిపల్ చైర్మన్ గా దూబ సోనియా మున్సిపల్ వైస్ చైర్మన్ గా రాజు ఎన్నిక అయ్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రాజుగారు మాట్లాడుతూ ఎన్నికల సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మరియు ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం. ఎ. ఫహీంకి, ముదిరాజు కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కి, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మొదటిసారిగా ఎన్నికైన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలను మొయినాబాద్ మున్సిపాలిటీలోని ప్రతి గడపకు అందేలా తన వంతు కృషి చేస్తానని రాజు తెలిపారు. తను ఎన్నికకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తొందర్లోనే తీరుస్తానని హామీ ఇచ్చారు.

## మానవత్వం చాటిన మహిళా కానిస్టేబుల్ శివాని

**కౌన్సిలర్ ప్రమాణస్వీకారం చేస్తుండగా.. ఎత్తుకున్న కానిస్టేబుల్**



పెబ్బేరు, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): ప్రజాస్వామ్య పండుగలో ఓ చిన్న మానవత్వ క్షణం అందరి హృదయాలను తాకింది. పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రంలో ఐదవ వార్డ్ కౌన్సిలర్‌గా ఎన్నికైన భాగ్యలక్ష్మి ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరైన వేళ, అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ శివాని చూపిన సేవా భావం అందరినీ ఆకట్టుకుంది. ప్రమాణస్వీకారానికి వచ్చిన ఒక చిన్నారి తన తల్లితో కలిసి కార్యక్రమానికి హాజరైంది. సభలో జనసమ్మర్థం, కోలాహలం మధ్య చిన్నారి అసౌకర్యంగా ఉండటాన్ని గమనించిన కానిస్టేబుల్ శివాని, విధుల్లో ఉన్నప్పటికీ మానవత్వాన్ని ముందుకు తెచ్చారు. ఆ చిన్నారిని ఆప్యాయంగా ఆలింగనం చేసి, కొద్దిసేపు ఆదరిస్తూ తల్లికి సహాయం చేశారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని కదిలించింది. పోలీసు విధుల్లో కఠినత్వం మాత్రమే కాకుండా, మానవత్వం కూడా ఉంటుందనే విషయాన్ని శివాని తన చర్యతో చాటిచెప్పారు. ప్రజల భద్రతే కాకుండా, వారి భావోద్వేగాలకు కూడా అండగా నిలబడగలమని నిరూపించారు. సోషల్ మీడియాలో ఈ సంఘటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఖాకీకి మానవత్వం కలిసొస్తే ఇలానే ఉంటుంది అంటూ పలువురు అభినందిస్తున్నారు.

## మృతిచెందిన వారి కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ





రేగొండ, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండల వాస్తవ్యులు మైస వీరాస్వామి, తడుక రాధ మరియు కొత్తపల్లి గోరి మండలం గాంధీ నగర్ వాస్తవ్యులు ఎంబాడి రాజక్క, నిజాంపల్లి వాస్తవ్యులు గుజ్జ బక్కమ్మ అదే విదంగా ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్ళి, వారి కుటుంబ సభ్యులను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలియచేయడం జరిగింది. అనంతరం ఇస్సిపేట గ్రామ వాస్తవ్యులు, సీనియర్ నాయకులు ఏనుమాముల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకట్ రావు మామగారు దుగ్యాల చోక్కారావు మరియు వారి బాబాయ్ పిన్నింటి రాజేశ్వర్ రావు మరణించగా వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. తదనంతరం పాత ఇస్సిపేట వాస్తవ్యులు జన్నే సదయ్య అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. వారి వెంట మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా మున్సిపల్ కౌన్సిలర్స్ ను "సన్మానించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర"



భూపాలపల్లి, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో గెలిచిన భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) కౌన్సిలర్ అభ్యర్థులను ఈరోజు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవ పట్ల నిబద్ధతతో పనిచేసి భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములవుతూ, పార్టీ గౌరవాన్ని మరింత పెంచాలని సూచించారు.

# పోషణ అభియాన్ అద్భుత పథకం

**రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి**

**అంగనవాడి అధికారులతో సమీక్ష సమావేశం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): స్థానిక సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నందుగల సమావేశ మందిరంలో మహిళా, శిశు, వయోవృద్ధులు మరియు వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారిని జె. స్వర్ణలత లెనీనా ఆధ్వర్యంలో వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ప్రతి ఒక్క అంగనవాడి కేంద్రం తెరవాలని, తెరిచిన వెంటనే టీచర్, హెల్పర్, లబ్ధిదారుల హాజరు కేంద్ర రాష్ట్ర స్థాయి అప్లికేషన్లు అయినటువంటి పోషణ ట్రాకర్ మరియు న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టంలో నమోదు చేయాలని తెలిపారు. వైద్యశాఖ సమన్వయంతో అతి తీవ్ర పోషణ లోపం, పోషణ లోపం, తక్కువ బరువుతో ఉన్న పిల్లలను ప్రత్యేకంగా పర్యవేక్షించి వైద్యుల సూచనల మేరకు న్యూట్రిషన్ రీహాబిటేషన్ సెంటర్కి పంపించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతినెల క్రమం తప్పకుండా అత్యాధునిక సాంకేతిక పరికారాలతో పిల్లల ఎత్తు, బరువులు చూసి సరైన సమయంలో సరైన పోషణ అందించాలని కోరారు. కిశోర బాలికల కోసం రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు క్రింద "ఇందిరమ్మ అమృతం" పేరుతో 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల ఆడపిల్లలకు మిల్లెట్స్ తో కూడిన చిక్కిలు నెల నెల అందజేయడం జరుగుతుందని తద్వారా రక్తహీనత లోపం లేకుండా ఆరోగ్యవంతులుగా ఉండడమే మన లక్ష్యం అన్నారు, నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి పౌష్టికాహార పంపిణీలో జాప్యం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఎవరైనా గుత్తేదారులు పంపిణీ విషయంలో కానీ నాణ్యత విషయంలో గానీ అలసత్వం ప్రదర్శిస్తే బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. ప్రతినెల షెడ్యూల్ ప్రకారం అంగనవాడి పర్యవేక్షకురాలు (సూపర్వైజర్) తమ సెక్టార్ యొక్క అంగన్వాడీ కేంద్రాల సందర్శించి రాష్ట్ర పోర్టల్ ఎం ఎం అంగనవాడిలో వివరాలను నింపాలని, పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహార విలువలపై టీచర్లకు అవగాహన కల్పిస్తూ, పోషణ అభియాన్ పథకంలో భాగంగా తల్లుల కమిటీ, గ్రామస్తులు, గ్రామ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో సామూహిక వేడుకలు అయినటువంటి అక్షరాభ్యాసం, అన్నప్రాసన, శ్రీమంతాలు నిర్వహిస్తూ వారిలో మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్రంలోని ఎక్కడ లేని విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ తనదైన శైలిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శాశ్వతంగా అంగన్వాడీ కేంద్రాలకు ఇచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేందుకు గాను పెరటి తోట పెంపకాలు (న్యూట్రి గార్డెన్స్) నిర్మించారని దీనిని ఆదర్శంగా తీసుకొని వివిధ జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని జే. స్వర్ణలత లెనీనా, జిల్లా సిడిపివోలు ప్రసన్న లక్ష్మి, జయలక్ష్మి, తార, అరుణ కుమారి, పద్మశ్రీ, చైతన్య, సలోమి, హేమ సత్య, జ్యోతి, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ పొనుగోటి సంపత్, జిల్లా కార్యాలయ సిబ్బంది హసీనా, భార్గవి, డి. సి .పి .ఓ హరికుమారి, చైల్డ్ లైన్ సందీప్, జిల్లా పోషణ అభియాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందుటకు అర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు ప్రీ ప్రమోషనల్ శిక్షణ





మామూనూరు, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): మామూనూరు 4వ బెటాలియన్లో సోమవారం నుండి పదోన్నతి పొందుటకు అర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు ప్రీ ప్రమోషనల్ శిక్షణ ప్రారంభ కార్యక్రమంకు కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. తెలంగాణ అర్మ్‌డ్ పోలీస్ విభాగానికి చెందిన పోలీసు కానిస్టేబుల్స్ హెడ్ కానిస్టేబుల్స్ గా, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్ సబ్ ఇన్స్పెక్టర్స్ గా పదోన్నతి పొందుటకు వీరికి 244 మంది హెడ్ కాన్స్టేబుల్స్ కి రెండు వారాలపాటు, 52 మంది రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్ కి 4వారాలపాటు శిక్షణ ఇవ్వన్నున్నారు. ఈ శిక్షణలో భాగంగా హెడ్ కానిస్టేబుల్స్ కి భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరికత సురక్ష సంహిత, స్పెషల్ అండ్ లోకల్ లాస్, భారతీయ సాక్ష్యం అధిన్యం, పోలీసు మాన్యువల్, పర్సనాలిటీ డెవలప్మెంట్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్ కి ఎక్స్ట్రీమిసం, డిజాస్టర్ మేనేజ్మెంట్,విఐపి సెక్యూరిటీ, గార్డ్స్ అండ్ ఎస్కార్ట్స్ (టిఎస్పిఎం), క్రిమినల్ మేజర్ యాక్ట్స్ (బిఎన్ఎస్, బిఎన్ఎస్ఎస్ బిఎస్ఎ), లీడర్షిప్ మేనేజ్మెంట్ అంశాలపై పూర్తి శిక్షణను నిష్ణాతులైన శిక్షకులచే ఇస్తున్నామని కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ కృష్ణప్రసాద్, వీరన్న ఆర్ఐలు కార్తిక్, రవి, రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, క్రిష్ణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్స్ శిరీష, శ్రావణ్ మరియు శిక్షణార్థులు, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాణ స్వీకారం చేసిన పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు

**మున్సిపల్ చైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్**



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): పరకాల మున్సిపల్ కార్యాలయంలోని సమావేశపు హాలులో నూతనంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్ ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కౌన్సిలర్ ల చేత పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్ లను మున్సిపల్ కమిషనర్ అంజయ్య, అధికారులు, సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ లకు ధ్రువపత్రాలను అధికారులు అందజేశారు. ముందుగా నూతన కౌన్సిలర్ ల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగగా అనంతరం పురపాలక ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ల ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నికకు కౌన్సిలర్ల నుండి ప్రతిపాదనలు అధికారులు ఆహ్వానించారు. ముందుగా ఛైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్ ను కౌన్సిలర్ లు ప్రతిపాదించి బలపరిచారు. అదేవిధంగా వైస్ చైర్ పర్సన్ గా ఏకు దివ్య ను ఎన్నుకున్నారు. చైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్, వైస్ చైర్ పర్సన్ గా ఏకు దివ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రవీందర్, టిపిఓ సుష్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో మదర్ ఫీడింగ్ రూమ్ ప్రారంభం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐడీఓసీ సమీకృత జిల్లా కార్యాలయముల సముదాయము నందు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ రూమ్ (బాలింత పాలు ఇచ్చే ప్రదేశం) ని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీ బాయ్ ప్రారంభించడం జరిగింది. ఏర్పాటు చేసిన హబ్ సిబ్బందిని అభినందించారు. వారు మాట్లాడుతూ కలెక్టరేట్ కి వివిధ పనుల నిమిత్తం చంటి పిల్లలతో వచ్చే తల్లులు తమ పిల్లలకు పాలు పట్టించాలంటే ఇబ్బందిగా ఉంటుందని అందరి ముందు పిల్లలకు పాలు ఇవ్వలేరని వారు సంశయిస్తుంటారని, వీటిని ఏర్పాటు చేయటం వలన వారు నిస్సంకోచంగా ఉపయోగించుకోగలుగుతారని అన్నారు. ఇలాంటి కేంద్రాలను బస్ స్టాండ్ మరియు రైల్వే స్టేషన్ లో కూడా ఏర్పాటు చేయ వలసినదిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంకా వారు మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం వంటి అంశాలపై తల్లులకు ఎక్కువగా అవగాహన కల్పించాలని, జననం తర్వాత తొలి ఆరు నెలలు శిశువుకు కేవలం తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామస్థాయి లో తల్లులకు వివరించాలని ఈ సందర్భంగా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లెనీనా వారి సిబంది హసీనా, భార్గవి, ఐసిడిఎస్ సీ డీ పి ఓ లు ప్రసన్న లక్ష్మి , పద్మ శ్రీ, తార, సలోమి , అరుణ , జయలక్ష్మి , జ్యోతి , చైతన్య మరియు సూపర్వైజర్స్, కోఆర్డినేటర్ సంతోష రూప మరియు సిబ్బంది, సఖి రాజమణి, సునీత మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ ఏకగ్రీవ ఎన్నిక

**మేయర్‌గా గణేష్, డిప్యూటీ మేయర్‌గా లలితా కుమారి ఎన్నిక**





కొత్తగూడెం, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది. మున్సిపల్ సాధారణ ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం మరియు మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల కార్యక్రమం నియమావళి ప్రకారం నిర్వహించబడింది. సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధ్యక్షత వహించి,ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మొత్తం 60 డివిజన్లకు గాను ఎన్నికైన కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. సీపీఐ పార్టీకి చెందిన 22 మంది, కాంగ్రెస్ పార్టీకి చెందిన 22 మంది, బీజేపీకి చెందిన 1 మంది, సీపీఎం పార్టీకి చెందిన 1 మంది, స్వతంత్రంగా గెలుపొందిన 6 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది. 20వ డివిజన్‌కు చెందిన సీపీఐ కార్పొరేటర్ మూడ్ గణేష్ మేయర్‌గా, 8వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ కార్పొరేటర్ సిరిపురపు లలితా కుమారి డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎక్స్- అఫీషియో సభ్యులుగా సమావేశానికి హాజరైన స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో సమాన అభివృద్ధి సాధించేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పట్టణంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పారదర్శక, బాధ్యతాయుత పాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎక్స్- అఫీషియో సభ్యులు నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్పొరేషన్ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమోయ్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన ఐడీఓసి కార్యాలయం నుండి వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జేఎన్ఎస్లో ఈ నెల 20 నుండి 23వరకు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్

**జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): సీఎం కప్ రెండో ఎడిషన్ రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా అథ్లెటిక్స్ కు సంబంధించిన పోటీలు హనుమకొండ జిల్లాలో ఈ నెల 20 నుండి 23 వ తేదీ వరకు జరగనున్నాయని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ హనుమకొండ జేఎన్ఎస్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి దాదాపుగా పదిహేను వందల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడాకారులకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా యువజన క్రీడల అధికారి అశోక్ కుమార్, డీఈవో గిరిరాజ్ గౌడ్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, డిఏఈఓ గోపాల్, డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ ఎన్. రవి వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 89 అర్జీలను అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను సంబంధిత శాఖల అధికారులు, తహసిల్దార్లను తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ నూతన పాలకవర్గంచే ప్రమాణ స్వీకారణ కార్యక్రమం

**జనగాం మున్సిపాలిటీకి చైర్ పర్సన్, వైస్ చైర్ ఎన్నిక వాయిదా**






జనగామ జిల్లా, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): సోమవారం జనగాం స్టేషన్ ఘన్పూర్, మున్సిపాలిటీ కార్యాలయాల్లో నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. జనగాం, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన నూతన పాలకవర్గ సభ్యులచే జనగాం, స్టేషన్గన్పూర్ ప్రిసైడింగ్ ఆఫీసర్ లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు గోపీరామ్, డిఎస్ వెంకన్న ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులచే ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించగా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కి సంబందించి చైర్మన్ గా తాటికొండ వినయ్ కుమార్ ను గుర్రం హరినాథ్ ప్రతిపాదించగా బొల్లు లక్ష్మి బలపరిచారు. అలాగే వైస్ చైర్పర్సన్ గా రాజమ్మ నీలను పొన్న రవి ప్రతిపాదించగా అంగడి రజిత బలపరిచారు. ఈ ఇద్దరిని ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం మెజార్టీ సభ్యులు ఎంచుకున్నారు. అనంతరం వారిని చైర్మన్ , వైస్ చైర్పర్సన్ గా స్టేషన్గన్పూర్ ప్రిసైడింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి డిఎస్ వెంకన్న ప్రమాణ స్వీకారం చేయించి, సంబంధిత ధ్రువపత్రాలను వారికి అందించారు. జనగాం మున్సిపాలిటీకి సంబందించి చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహణకి అనుకూల పరిస్థితులు లేకపోవడంతో ప్రిసైడింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి గోపీరామ్ మంగళవారానికి ఎన్నికని వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లు, తాసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నుండి కాంగ్రేస్ పార్టీలో చేరిన సర్పంచ్

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి సీతక్క**



ములుగు, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): కన్నాయిగూడెం మండలం నుండి బి ఆర్ ఎస్ పార్టీ వీడి మంత్రి వర్యులు సీతక్క సమక్షంలో ఈరోజు ములుగు డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగినా ముఖ్య కార్యకర్తల సమావేశానికి వచ్చిన మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రేస్ పార్టీలో చేరిన కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి నుండి ఎకక్రీవంగా సర్పంచ్ గా ఎన్నికైన తిప్పనపల్లి లక్ష్మయ్య సర్పంచ్ మరియు లక్ష్మీపూర్ గ్రామ పంచాయతి మాజీ సర్పంచ్ కొట్టె ఉమామహేశ్వరి వీరికి మంత్రి సీతక్క కాంగ్రేస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు

ముప్పనపల్లి నుండి కాంగ్రేస్ పార్టీలో చేరిన వారి పేర్లు తిప్పనపల్లి ఎర్ర సమ్మయ్య, తిప్పనపల్లి మహేష్, తిప్పనపల్లి మహేందర్, తిప్పనపల్లి వెంకటేష్, తిప్పనపల్లి లక్ష్మయ్య, తిప్పనపల్లి సంతోష్, సోదండి రాజు, తిప్పనపల్లి ప్రవీణ్ జిలకర మహంకాలి, చెన్నూరు బాపు.... వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి సీతక్క. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు ఎండీ, అప్సర్ పాషా, మండల ఇంచార్జి సర్పంచ్ జాడి రాంబాబు, మరియు కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా నాయకులు వివిధ గ్రామాల సర్పంచ్ లు,వివిధ హోదాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా సీతక్కకు సన్మానం



ములుగు, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన శుభ సందర్భంగా, నూతన చైర్మన్ల ఎన్నిక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దనసరి సీతక్కని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన చల్వాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో చల్వాయి సర్పంచ్ మేకల రాధ- సుదర్శన్, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్, జిల్లా కార్యదర్శి గనపాక సుధాకర్,యూత్ కాంగ్రెస్ నాయకులు తాటి శ్రీను మరియు తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిశానిర్దేశం కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

**సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన ప్రిసైడింగ్ అధికారులు**





వరంగల్ జిల్లా , ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీల ప్రత్యేక సమావేశాలు సోమవారం పూ-ర్తయ్యాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ల ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. వర్ధన్నపేట, పురపాలక సంఘం సమావేశానికి వరంగల్ ఆర్డీఓ సుమా ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించగా, నర్సంపేట ప్రిసైడింగ్ అధికారిగా ఉమారాణి బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11.00 గంటలకు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఆయా పార్టీల వారీగా సభ్యులు సమావేశ మందిరాలలోకి చేరుకోగా, వరుస క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రిసైడింగ్ అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా హోదా కలిగిన ఎమ్మెల్యేలు సైతం స్పెషల్ మీటింగ్ లకు హాజరై చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ఎన్నికలో పాల్గొన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు శివకుమార్ నాయుడు ఎన్నిక ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు సరిపడా కోరం ఉందని నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ నగర చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైన పాలకుర్తి సారంగపాణి పేరును ఆ పార్టీకి చెందిన సభ్యుడు మాలోతు దేవేందర్ ప్రతిపాదించగా, బెజ్జం పాపయ్య బలపర్చారు. అలాగే, బి ఆర్ ఎస్ పార్టీ నుండి బి ఫామ్ సకాలంలో రానందు వల్ల బి ఆర్ ఎస్ తరపున ఎన్నికల బరిలో నిలుచున్న చైర్మన్ అభ్యర్థిగా గుజ్జ వీరన్న పేరును స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తూ బానోతు జ్యోతి ప్రతిపాదించగా, చిలువేరు రమ బలపర్చారు. కాంగ్రేన్ పార్టీ నుంచి మాత్రమే విప్ జారీ చేయడం జరిగిందని, ఇతర పార్టీల నుంచి విప్ జారీ చేయబడలేదని ఈ సందర్భంగా ఆర్డీఓ సుమా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున చైర్పర్సన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన పాలకుర్తి సారంగపాణి కు

మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికైన 5 గురు, స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన నేతావత్ షిబారాణి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు చెయ్యి ఎత్తు విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 7 గురి మద్దతు ఉండడంతో పాలకుర్తి సారంగపాణిని వర్ధన్నపేట పురపాలక సంఘం చైర్పర్సన్ గా ఎన్నికైనట్లు ఆర్డీఓ సుమా ప్రకటించారు. అలాగే బిఆర్ఎస్ నుంచి గెలుపొందిన 6 మంది సభ్యులు

గుజ్జ వీరన్న కు మద్దతుగా చేతులెత్తే విధానం ద్వారా మద్దతు ప్రకటించారు. అనంతరం వైస్ చైర్మన్ గా స్వతంత్ర అభ్యర్థి నేతావత్ షిబారాణి పేరును కాంగ్రెస్ సభ్యులు నునావత్ కామ్లి ప్రతిపాదించగా, అదే పార్టీ అభ్యర్థి వాణి తిరుపల్లి బలపరిచారు.

బిఆర్ఎస్ సభ్యుల తరపున వైస్ చైర్మన్ అభ్యర్థిగా తిరుపతి సురేష్ కు అదే పార్టీ అభ్యర్థిని తుమ్మల అరుణ ప్రతిపాదించగా, బీఆర్ ఎస్ నుండి చిలువేరు కుమారస్వామి బలపరిచారు. స్వతంత్ర అభ్యర్థి షిబారాణి కు 6 గురు మంది కాంగ్రెస్ సభ్యులతోపాటు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు చేతులెత్తే విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 7 మంది మద్దతు ఉండడంతో నేతావత్ షిబారాణి ను వైస్ చైర్మన్ గా ఎన్నికైనట్లు ఆర్డీఓ సుమా ప్రకటించారు.

అనంతరం చైర్పర్సన్ గా ఎన్నికైన

సారంగపాణితో, వైస్ చైర్మన్ గా ఎన్నికైన నునావత్ షిబారాణి తో ఆర్డీఓ సుమా ప్రమాణ స్వీకారం చేయించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, క్షేత్రస్థాయిలో స్వీయ పర్యవేక్షణ జరుపుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, వీడియో చిత్రీకరణ నడుమ పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నికల ప్రక్రియను జరిపించారు. నర్సంపేట మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్ ఎన్నికల కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. మున్సిపల్ ఎన్నికల ఆథరైజ్డ్ అధికారి, నర్సంపేట ఆర్డీవో పోలం ఉమారాణి ఆధ్వర్యంలో, మున్సిపల్ కమిషనర్ భాస్కర్ సు-ధీర్ కుమార్ గారి సమక్షంలో గెలుపొందిన వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చట్టం ప్రకారం చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పాల్గొన్నారు. మున్సిపాలిటీ చైర్పర్సన్‌గా పెండెం శ్రీలక్ష్మి రామానంద్, వైస్ చైర్పర్సన్‌గా గంధం నరేందర్ ని ఏకగ్రీవంగా (కాంగ్రెస్ పార్టీ) ఎన్నుకున్నట్లు ఆథరైజ్డ్ అధికారి అధికారికంగా ప్రకటించారు. మొత్తం 30 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 21, బీఆర్ఎస్ 6, బీజేపీ 1, సీపీఎం 1, ఇండిపెండెంట్ 1 స్థానాలను గెలుచుకున్నాయి. వార్డు సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థులు శ్రీలక్ష్మి రామానంద్ చైర్పర్సన్‌గా, గంధం నరేందర్ వైస్ చైర్పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ల ఎన్నికను పురస్కరించుకుని ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా మున్సిపల్ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు ఏ.సీ.పీ లు నర్సయ్య , ఇతర పోలీసు అధికారులు బందోబస్తును పర్యవేక్షించారు.







# నర్సింగ్ అధికారులకు ఐఎన్సీ తీపి కబురు



**రిజిస్ట్రేషన్ రెన్యువల్ నిబంధనల్లో మినహాయింపు**

**150 గం సీఎన్ఈ క్రెడిట్ అవర్స్ నిబంధన నుండి ఊరట**

**తొలిసారి రిజిస్ట్రేషన్ అభ్యర్థులకు లబ్ధి**

**వర్క్‌షాప్‌లకు గుర్తింపు..వేలాది మందికి ప్రయోజనం**



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని నర్సింగ్ ఆఫీసర్లకు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్సీ) తీపి కబురు అందించింది. నర్సింగ్ రిజిస్ట్రేషన్ల రెన్యువల్ కోసం అవసరమైన 150 గంటల కంటిన్యూయింగ్ నర్సింగ్ ఎడ్యుకేషన్ (సీఎన్ఈ) క్రెడిట్ అవర్స్ నిబంధనలో కీలక మినహాయింపులు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ స్టేట్ నర్సెస్ అండ్ మిడ్‌వైవ్స్ కౌన్సిల్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ఐఎన్సీ నర్సులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా 2026, డిసెంబర్ 31 వరకు సీఎన్ఈ క్రెడిట్ అవర్స్ నుంచి మినహాయింపు ఇచ్చింది. అయితే ఈ మినహాయింపు పొందే అభ్యర్థులు ఏడాదిలోగా 120 గంటల వర్క్‌షాప్, శిక్షణ లేదా ఈ-లెర్నింగ్ పూర్తి చేస్తామని అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుంది.

**మొదటిసారి రిజిస్ట్రేషన్**

మొదటిసారి రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకునే అభ్యర్థులు 5 ఏళ్ల లోపు దరఖాస్తు చేసుకుంటే వారికి 30 సీఎన్ఈ గంటలను కేటాయించాలని ఐఎన్సీ సూచించింది. సరైన ప్రమాణాలు ఉంటే, ఆసుపత్రులు, ఎన్.హెచ్.ఎం నిర్వహించే వర్క్‌షాప్‌లను కూడా సీఎన్ఈ కింద పరిగణించాలని నిర్ణయించింది. ఈ మేరకు భారత నర్సింగ్ కౌన్సిల్ కార్యదర్శి కల్నల్ సర్వ జీత్ కౌర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం వల్ల తెలంగాణలోని వేలాది మంది నర్సింగ్ అధికారులకు రెన్యువల్ ప్రక్రియలో పెద్ద ఉపశమనం లభించనుంది.

# కేంద్ర నిధులపై సీఎస్ రామకృష్ణారావు గురి

**రూ. 15 వేల కోట్ల బకాయిల రాబట్టడమే లక్ష్యం**

**మార్చి నెలాఖరు గడువు.. శాఖల వారీగా సమీక్ష**



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో సీఎస్ సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించు కునేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని సీఎస్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఏ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్, ఇతర పథకాల కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని, వాటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు.

**100 వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక**

సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2 నుంచి జూన్ 2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్ట్మెంట్‌ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామ పంచాయతీ, మున్సిపల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు 100 డేస్ యాక్షన్ ప్లాన్ ఉపకరిస్తుందని సీఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను మంగళవారం సమర్పించాలని సీఎస్ సూచించారు.

# కాంగ్రెస్ నేతలకు పార్లమెంటరీ సెక్రటేరియట్ నోటీసులు

**ఏఐ వీడియోలు, అనుచిత ప్రవర్తనపై సీరియస్**

**తొమ్మిది మంది నేతలకు గడువు**

**ప్రచారంపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం**

**రేణుకా చౌదరికి ప్రివిలేజ్ నోటీసు జారీ**



న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): తొమ్మిది మంది కాంగ్రెస్ నేతలకు లోక్‌సభ సచివాలయం నోటీసులు ఇచ్చింది. ప్రధాని నరేంద్ర మోడీ, స్పీకర్ ఓంబిర్లాపై ఏఐ వీడియో ప్రచారం చేశారని నోటీసుల్లో పేర్కొంది. దీనిపై మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని డెడ్‌లైన్ పెట్టింది. సభా హక్కులు ఉల్లంఘించి తప్పుడు వీడియోను ప్రచారం చేయడం సరికాదని అభిప్రాయపడింది. మరోవైపు ఇప్పటికే రాజ్యసభ సభ్యురాలు, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరికి ప్రివిలేజ్ కమిటీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. పార్లమెంటు కాంప్లెక్స్‌లోకి వీధి కుక్కను తీసుకురావడంతో పాటు, ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగాను ఆమెపై సభా హక్కుల ఉల్లంఘన చర్యలకు కమిటీ సిద్ధమైంది. ఎంపీ రేణుకా చౌదరిపై బీజేపీ ఎంపీలు ఇచ్చిన ఫిర్యాదును రాజ్యసభ ప్రివిలేజ్ కమిటీ స్వీకరించింది. ఫిబ్రవరి 23లోగా దీనిపై వివరణ ఇవ్వాలని ఆమెను ఆదేశించినట్టు తెలుస్తోంది. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా డిసెంబర్ 1న ఎంపీ రేణుకా చౌదరి ఒక వీధి కుక్కను తన కారులో పార్లమెంటు కాంప్లెక్స్ లోకి తీసుకువచ్చిన విషయం అందరికీ తెలిసిందే.

# తెలంగాణ - ఏపీ సరిహద్దు "చిక్కుముడి వీడేనా..?"

**విభజన సమస్యల పరిష్కారానికి తుమ్మల, చంద్రబాబు భేటీ**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా సరిహద్దు వివాదాలపై చర్చ**

**ఐదు పంచాయతీల భవితవ్యంపై సంప్రదింపులు**

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): ఏపీ పునర్ వ్యవస్థీకరణ జరిగి 12 ఏళ్లు అవుతోన్న విషయం తెలిసిందే. అయితే తెలంగాణ, ఏపీ సరిహద్దు సమస్యలు అలాగే మిగిలిపోయి ఉన్నాయి. గత పదేళ్లలో సరిహద్దులు విషయంలో ప్రతిసారి రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. దీంతో సమస్య పరిష్కారం జఠిలంగా మారింది. అయితే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య సానుకూలం వాతావరణం నెలకొంది. విభజన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతోంది. నీటి విషయం కోర్టుల్లోనూ, ట్రైబునల్‌లో వాదనలు వినిపిస్తుండగా కొన్ని సమస్యలు చర్చల ద్వారా పరిష్కారం చూపేందుకు సుముఖంగా వ్యవహరిస్తున్నారు.

**ఉమ్మడి ఖమ్మం జిల్లా**

తాజాగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉమ్మడి సరిహద్దు సమస్యను పరిష్కరించేందుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చాయి. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ చూపారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును అమరావతి ఉండవల్లిలో కలిశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సరిహద్దు సమస్యపై చర్చిస్తున్నారు. ఐదు గ్రామ పంచాయతీల విలీనం, పెద్దవాగు ప్రాజెక్టు, రైల్వే లైన్లు, హైవేల పనులపైనా చర్చించారు. త్వరలోనే ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని నిర్ణయించారు.



# అట్టహాసంగా హైదరాబాద్‌లో బయో ఏషియా

మొదటి పేజీ తరువాయి

జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు ఇతివృత్తంగా నిర్వహిస్తున్నారు. టెక్‌బయో ఇన్నోవేషన్స్‌లో దేశం గ్లోబల్ హబ్‌గా మారుతున్న తరుణంలో, అధునాతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో లైఫ్ సైన్సెస్ రంగంలో భవిష్యత్తు ఆరోగ్య సంరక్షణ సంబంధించిన అంశాలపై ఈ సదస్సు చర్చించనుంది.

**వివిధ దేశాల ప్రతినిధులు హాజరు**

లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏర్పాటు చేసే అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. అనంతరం బయోఏషియా సదస్సును ప్రారంభించి ప్రసంగిస్తారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, శాస్త్రవేత్తలు, బయో సైన్సెస్ రంగంలో నిష్ణాతులు ఆయా అంశాలపై ప్రసంగించనున్నారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, అమెరికాకు చెందిన ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ కీలకోపన్యాసం చేయనున్నారు. సైన్స్, సాఫ్ట్‌వేర్ అండ్ సప్లయ్, నెక్స్ట్ జనరేషన్ బయోలాజిక్స్, ఫార్మా, బయోటెక్ భవిష్యత్తు, ఏఐ, ఆర్ అండ్ డీ (డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్), గ్లోబల్ ఇంపాక్ట్, తెలంగాణ రైజింగ్ 2047 - వరల్డ్-క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ వంటి కీలక అంశాలపై జరిగే చర్చల్లో వివిధ దేశాల నుంచి హాజరైన ప్రతినిధులు పాల్గొంటారు.

# భారత్ వేదికగా ఏఐ విప్లవం

మొదటి పేజీ తరువాయి

నరేంద్ర మోడీ ఈ సదస్సుతో పాటు 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో'ను అధికారికంగా ప్రారంభించారు.

**గ్లోబల్ సౌత్‌లో మొదటి గ్లోబల్ సదస్సు**

ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమిలో ఇటువంటి అంతర్జాతీయ ఏఐ సదస్సు నిర్వహించడం ఇదే తొలిసారి అధికారులు చెబుతున్నారు. ఈ సదస్సు ద్వారా అంతర్జాతీయ ఏఐ ప్రమాణాలను రూపొందించడంలో భారత్ తన కీలక పాత్రను చాటుకోనుంది. సుమారు 100 కు పైగా దేశాల ప్రతినిధులు హాజరవుతున్న ఈ ఈవెంట్ కోసం ఇప్పటికే రెండు లక్షల మందికి పైగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**ఎక్స్‌పోలో స్టార్టప్‌ల సందడి**

ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని మోడీ ఎక్స్‌పోలోని వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. ఈ ప్రదర్శనలో అత్యంత సామర్థ్యం గల 600 స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్నాయి. ఆస్ట్రేలియా, జపాన్, రష్యా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ వంటి 13 దేశాలు ప్రత్యేక పెవిలియన్లను ఏర్పాటు చేసి అంతర్జాతీయ సహకారాన్ని చాటుతున్నాయి. ఈ సమ్మిట్‌ను పీపుల్ (ప్రజలు), ప్లానెట్ (గ్రహం), ప్రోగ్రెస్ (పురోగతి) అనే మూడు చక్రాల (థీమ్స్) ఆధారంగా రూపొందించారు.

**నేటి నుంచి సామాన్యులకు**


7,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, 10 ప్రధాన ఏరినాల్లో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 16న ప్రధాని చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ప్రదర్శన, ఫిబ్రవరి 17 నుంచి సామాన్య ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ సదస్సు ఫిబ్రవరి 20 వరకు కొనసాగుతుంది. భారతదేశాన్ని గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా జరుగుతున్న ఈ సదస్సులో ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, దిగ్గజ టెక్ కంపెనీలు కలిసి పనిచేయనున్నాయి.

# జేఈఈ మెయిన్స్‌లో "తెలుగు విద్యార్థుల ప్రభంజనం"



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): జేఈఈ మెయిన్స్ ఫలితాలు విడుదల అయ్యాయి. ముగ్గురు తెలుగు విద్యార్థులకు 100 పర్సంటైల్ వచ్చింది. తెలంగాణకు చెందిన విద్యార్థి వివన్ శరద్ మహేశ్వరీ, ఏపీకి చెందిన జి. నరేంద్ర బాబు, పసల మోహిత్‌కు 100 పర్సంటైల్ వచ్చింది. ఓబీసీ విభాగంలో టాపర్‌గా నరేంద్ర బాబు నిలిచారు. పేపర్ 1, పేపర్ 2 పరీక్షల్లో సోమవారం కేవలం పేపర్ 1 ఫలితాలు మాత్రమే విడుదల చేశారు. పేపర్ 2 ఫలితాలను త్వరలోనే విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు సహా పలు ప్రతిష్టాత్మక విద్య సంస్థల్లో బీఈ/బీటెక్ అడ్మిషన్ల కోసం జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ జేఈఈ మెయిన్స్ సెషన్ 1 పరీక్షలను ఈ జనవరి 21,22,23, 24,28 తేదీల్లో నిర్వహించింది. ఇందులో ఉత్తీర్ణులైన వారి కోసం ఇవాళ ఫలితాలను విడుదల చేసింది. ఫలితాలను తెలుసుకోవాలంటే ఎన్టీఏ అధికారిక వెబ్ సైట్ https://jeemain.nta.nic.in/ లోకి వెళ్లాలి. అక్కడ అభ్యర్థులు వారి అప్లికేషన్ నంబర్, లాగిన్ ఐడీ, పాస్ వర్డ్ ఉపయోగించి స్కోర్ కార్డుల్ని ఓపెన్ చేసి డౌన్ లోడ్ చేసుకోవచ్చు. వీటిని ప్రింట్ తీసుకుని కౌన్సిలింగ్ కు హాజరు కావాల్సి ఉంటుంది.

# కాంగ్రెస్, బీజేపీలది 'ఫెవికాల్' బంధం



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలు ఒకటేనని ఈ మున్సిపల్ ఫలితాలు మరోసారి రుజువు చేశాయని, రాష్ట్రంలో జెండాలు అజెండాలను పక్కనపెట్టి అధికార పీఠం కోసం ఎంతలా దిగజార్చవచ్చో నేడు కాంగ్రెస్, బీజేపీలు నిరూపించాయని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఢిల్లీలో కొట్టుకున్నట్టు గల్లీలో మాత్రం చేతులు కలుపుతూ వాటాలు వేసుకొని పదవులు పంచుకుంటున్నారని దీనికి ఆలియాబాద్, మెదక్, నర్సాపూర్, అమన్‌గల్ ఫలితాలే ప్రత్యక్ష సాక్ష్యం అని మార్పు అంటే బీజేపీతో జతకట్టడమేనా? ఇదేనా మీరు తెస్తానన్న మార్పు అని కాంగ్రెస్ ను ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.

**కాంగ్రెస్, బీజేపీ సింగిల్ టీమ్:**

గత 12 ఏండ్లుగా బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి బీ-టీమ్ అని కాంగ్రెస్, కాంగ్రెస్‌కు బీ-టీమ్ అని బీజేపీ చెప్పినవన్నీ పచ్చి అబద్దాలు అని, ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ అని నిరూపించాయన్నారు. బీజేపీతో కలిసి సింగిల్ టీమ్‌గా మారిపోయిందని. ఈ అపవిత్ర కలయిక, ఈ అనైతిక పొత్తు ప్రజలు గుర్తించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న ఫెవికాల్ బంధం ఈరోజు మున్సిపల్ ఫలితాలతో మరోసారి స్పష్టమైంది. కేవలం బీఆర్ఎస్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ రెండు పార్టీలు సిద్ధాంతాలను గాలికొదిలేశాయని ధ్వజమెత్తారు.

**ఏ సర్కార్ నడుపుతున్నారు?**

రేవంత్ రెడ్డి నడిపేది కాంగ్రెస్ సర్కారా? బీజేపీ సర్కారా? లేదా బీజేపీ-టీడీపీతో కూడిన సంకీర్ణ సర్కారా? అని ఆయన ప్రశ్నించారు. ఆలియాబాద్ నుంచి అమన్‌గల్ దాకా మెట్‌పల్లి నుంచి మెదక్ దాకా మీరు సాగిస్తున్న ఈ చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒంటరిగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తా లేదని అందుకే సిగ్గు వదిలేసి బీజేపీతో కుమ్మక్కైందన్నారు. రెండు జాతీయ పార్టీలు బీఆర్ఎస్‌ను నిలువరించి అధికారాన్ని చేపట్టడానికి ఏదో ఒక విధంగా ఫలితాలను తారుమారు చేస్తూ మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నాయన్నారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఏమో దేశమంతా బీజేపీ మీద పోరాటం చేస్తే ఇక్కడ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఏమో బీజేపీతో జత కడుతున్నదన్నారు.

**కాంగ్రెస్ యుక్త్ బీజేపీ అని నిరూపిస్తున్నారు:**

రాహుల్ గాంధీ మీరు ఢిల్లీలో రాజ్యాంగం పట్టుకొని తిరుగుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారని దానికి ఈ పొత్తులే సాక్ష్యం అన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డిని, బండి సంజయ్‌ను సూటిగా ప్రశ్నిస్తున్నాను మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నికకు బీజేపీ పార్టీ కాంగ్రెస్‌తో కలిసింది మీకు తెలియదా? తెలిసే చేశారా? ఢిల్లీలో పెద్దలు కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటారు ఇక్కడ మీరేమో కాంగ్రెస్ యుక్త్ బీజేపీ అని నిరూపిస్తున్నారని ధ్వజమెత్తారు.

**సింగిల్‌గా ఎదుర్కొలేకే**

బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న బలాన్ని చూసి భయపడే మీరు ఈ కుట్రలకు తెరలేపారని సింగిల్‌గా మా పార్టీని ఎదుర్కొనే దమ్ములేక రెండు జాతీయ పార్టీలు ఒక్కటై, బీఆర్ఎస్ మీద దాడి చేస్తున్నాయన్నారు. ఇది మా విజయానికి నిదర్శనం కాక మరి ఏమిటి అని నిలదీశారు. బీఆర్ఎస్ అత్యధిక వార్డులు గెలుచుకున్న చోట్ల కూడా కుట్రలు చేసి పదవులు దక్కించుకున్నారని నర్సాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్ పదవి కాంగ్రెస్ తీసుకుని, వైస్ చైర్మన్ పదవి బీజేపీకి ఇచ్చారంటే ఇంతకంటే దిగజారుడు రాజకీయం మరొకటి ఉంటుందా? అని మండిపడ్డారు. ఒక పక్క నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎంఐఎంతో పొత్తు పెట్టుకుంటారు. మరోపక్క ఉత్తర తెలంగాణలో బీజేపీతో జతకడతారు. ఇదేనా ప్రజా పాలన అన్నారు.

**హైజాక్ చేశారు**

సిర్పూర్ కాగజ్‌నగర్‌లో, మెట్‌పల్లిలో కూడా ఇదే తంతు నిర్వహించారని చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను బీజేపీ కాంగ్రెస్ పంచుకోవడం రాష్ట్ర ప్రజలే కాదు దేశ ప్రజలు కూడా గమనిస్తున్నారన్నారు. నర్సాపూర్‌లో కాంగ్రెస్ చైర్మన్ - బీజేపీ వైస్ చైర్మన్. సిర్పూర్ కాగజ్‌నగర్ లో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ (11 సీట్లు) ఉన్నా కాంగ్రెస్, బీజేపీలు కలిసి అధికార పీఠాన్ని హైజాక్ చేశాయన్నారు. అలియాబాద్ లో బీజేపీకి ఉన్న 3 సీట్ల మద్దతుతో కాంగ్రెస్ చైర్మన్ సీటు దక్కించుకుందని మెట్‌పల్లిలో విచిత్రం ఏంటంటే బీజేపీకి అధికారం దక్కేలా కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందన్నారు. అమన్ గల్ ఇక్కడ కూడా బీజేపీ, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం నడిచిందిన్నాకుయ

**మీ బంధాన్ని చూడలేకే**

కాంగ్రెస్ బీజేపీ ఫెవికాల్ బంధాన్ని చూడలేక కొన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లో మేము ఓటింగ్‌కు దూరంగా ఉన్నామన్నారు. మరొకవైపు క్యాతనపల్లి, తొర్రూరు, జనగామ, జహీరాబాద్ లాంటి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు మెజారిటీ సీట్లు కట్టబెట్టినప్పటికీ అక్కడ ప్రజా తీర్పును గౌరవించకుండా అధికార యంత్రాంగాన్ని, పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని చైర్మన్ పీఠాలను హైజాక్ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ, అధికారులను పావులుగా వాడుకుంటూ ఎలాగైనా సరే అందలం ఎక్కాలని కాంగ్రెస్, బీజేపీలు కుటిల రాజకీయాలకు తెరలేపాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని దెబ్బకొట్టడానికి సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చారని కాంగ్రెస్ ముసుగులో బీజేపీ, బీజేపీ ముసుగులో కాంగ్రెస్ పనిచేస్తున్నాయి. ఈ అపవిత్ర కలయికను తెలంగాణ సమాజం అసహ్యించుకుంటున్నదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్తారన్నారు.

# హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ గురి

మొదటి పేజీ తరువాయి

మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ గుండాగిరి చేస్తోందని మండిపడ్డారు. కిడ్నాప్‌లు, దాడులు, అక్రమ ఓట్లతో పదవులు పొందిందని ఆరోపించారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలకు ఇవాళ్టి పరిణామాలే నిదర్శనమని అన్నారు. ఎక్స్‌అఫీషియో ఓట్లతో పేరుతో దొంగ ఓట్లు నమోదు చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ తొత్తులుగా మారిన పోలీసులపై తెలంగాణ డీజీపీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**పోలీసులపై చర్యలు తీసుకోండి**

కేవలం కాంగ్రెస్ నేతల ఒత్తిడి మేరకు కొన్ని ప్రాంతాల్లో చైర్మన్ల ఎన్నికను వాయిదా వేశారని విమర్శించారు. వాయిదా వేసిన అధికారులపై ఎన్నికల సంఘం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కాగా, తెలంగాణలో మొత్తం మున్సిపాలిటీలు 116 ఉండగా అందులో కాంగ్రెస్ 87, బీజేపీ 1, బీఆర్ఎస్ 17 కైవసం చేసుకుంది. మరో 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా పడింది. ఏడు కార్పొరేషన్లలో కాంగ్రెస్ 5, సీపీఐ-మిత్రపక్షం 1, బీజేపీ 1 కైవసం చేసుకున్నాయి.



# ఆస్ట్రేలియా జట్టులోకి స్టీవ్ స్మిత్ !!

## టీ20 ప్రపంచ కప్ నుంచి తప్పుకున్న మిచెల్ మార్ష్

ఆస్ట్రేలియా టీ20 కెప్టెన్ మిచెల్ మార్ష్ 2026 టీ20 ప్రపంచ కప్ నుంచి తప్పుకున్నాడు. ఐర్లాండ్ తో మ్యాచ్ కు ముందు ప్రాక్టీస్ సమయంలో మార్ష్ గాయపడ్డాడు. దీని వల్ల అతను మొదటి రెండు మ్యాచ్ లు ఆడలేకపోయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతను టోర్నమెంట్ కు పూర్తిగా దూరమయ్యాడు. ఆస్ట్రేలియా జట్టులో మిచెల్ మార్ష్ స్థానంలో స్టీవ్ స్మిత్ చేరాడన్నది కీలక వార్త. శ్రీలంకతో జరిగే కీలక మ్యాచ్ లో అతను ఆడనున్నాడు.స్టీవ్ స్మిత్‌ను ఒక ప్రధాన టెస్ట్ బ్యాట్స్‌మన్‌గా పరిగణిస్తారు. కానీ, అతను గొప్ప టీ20 బ్యాట్స్‌మన్ కూడా. టీ20 క్రికెట్‌లో అతని ఫామ్ కూడా ఆకట్టుకుంటుంది. సిడ్నీ సిక్సర్స్ తరపున బిగ్ బాష్ లీగ్‌లో స్మిత్ అసాధారణంగా రాణించాడు. కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 59.8 సగటుతో 299 పరుగులు చేశాడు. ముఖ్యంగా, అతని స్ట్రైక్ రేట్ 167.97గా ఉంది. ఇది అతని కెరీర్ స్ట్రైక్ రేట్ కంటే చాలా ఎక్కువ. స్మిత్ ఆరు బిగ్ బాష్ మ్యాచ్‌లలో రెండు హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ కూడా చేశాడు. స్టీవ్ స్మిత్ 272 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. అతను 32.68 సగటుతో 6242 పరుగులు చేశాడు. స్మిత్ టీ20 క్రికెట్‌లో ఐదు సెంచరీలు, 30 హాఫ్ సెంచరీలు చేశాడు. ప్రొఫెషనల్ క్రికెట్‌లో అతనికి 74 సెంచరీలు ఉన్నాయి.ఆస్ట్రేలియా జట్టు మిచెల్ మార్ష్‌ను కోల్పోతుంది. ఓపెనర్‌గా ఆస్ట్రేలియా తరపున అనేక మ్యాచ్‌లను గెలిపించాడు. మార్ష్ అంతర్జాతీయ టీ20లలో 32.33 సగటుతో 2102 పరుగులు, 140కి దగ్గరగా స్ట్రైక్ రేట్ సాధించాడు. మార్ష్ ఒక సెంచరీ, 11 హాఫ్ సెంచరీలు సాధించాడు. మార్ష్, హెడ్ భాగస్వామ్యం ప్రత్యర్థి జట్లకు పీడకలగా మారుతోంది. కానీ ఇప్పుడు ఈ భాగస్వామ్యం విచ్ఛిన్నమైంది. జింబాబ్వేతో జరిగిన మునుపటి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓడిపోయింది. ఇప్పుడు శ్రీలంకపై ఎలాగైనా గెలవాల్సి ఉంది. ఒకవేళ ఓడిపోతే జింబాబ్వే సూపర్ 8కి అర్హత సాధించవచ్చు.

# పాక్ ఓటమిని శాసించింది వీరే..

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు పాకిస్థాన్‌పై మరో చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. దాంతో సూపర్-8లో తన స్థానాన్ని దాదాపు ఖరారు చేసుకుంది. ఎంతో ఉత్కంఠ రేపుతుందని ఆశించిన ఫ్యాన్స్ కు నిరాశ కలిగిస్తూ ఏకపక్షంగా సాగిన మ్యాచులో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగిన పోరులో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమ్ ఇండియా అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ లో అద్భుత ప్రదర్శన చేసింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 175 పరుగులు బోర్డుపై ఉంచింది. టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్‌పై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఆరంభంలోనే షాక్ తగిలినప్పటికీ, ఆ తర్వాత మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ తన ధనాధన్ బ్యాటింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. ఇషాన్ వేగంగా పరుగులు రాబడుతూ 40 బంతుల్లో 77 పరుగులు చేశాడు. స్టేడియం నలుమూలలా షాట్లు ఆడుతూ పాకిస్థాన్ బౌలర్లపై ఒత్తిడి పెంచడంలో సక్సెస్ అయ్యాడు. తన పరుగులతో భారత విజయంలో కీలక పాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కించుకున్నాడు. ఇషాన్ కిషన్ అవుట్ అయిన తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. మిడిల్ ఓవర్లలో ఆచితూచి బ్యాటింగ్ చేస్తూ తిలక్ వర్మతో కలిసి భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును 170 దాటించడంలో కీలకపాత్ర పోషించాడు. . సూర్య 29 బంతుల్లో 32 పరుగులు చేయగా.. చివర్లో ఆల్ రౌండర్ శివమ్ దూబే 158.82 స్ట్రైక్ రేట్‌తో 27 పరుగులు చేశాడు. దాంతో భారత్ ఈ పిచ్ మీద పాక్‌కు భారీ టార్గెట్ ఇవ్వగలిగారు. 175 పరుగుల టార్గెట్ కాపాడుకునే క్రమంలో బరిలోకి దిగిన భారత జట్టుకు బౌలర్లు అద్భుత ఆరంభాన్ని ఇచ్చారు. హార్దిక్ పాండ్యా తన మొదటి ఓవర్లోనే పాకిస్థాన్ ఓపెనర్‌ను అవుట్ చేసి తొలి దెబ్బ కొట్టాడు. 3 ఓవర్లలో కేవలం 16 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. తన బౌలింగ్ లో పాక్ బ్యాటర్లకు స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వలేదు. పాక్ స్పిన్నర్లతో ఇబ్బంది పెడితే భారత్ మాత్రం పేసర్లు, స్పిన్నర్లతో పాక్ ను కట్టడి చేసింది.భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తన స్పెల్‌లో సయీమ్ అయూబ్, పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆగా వికెట్లు తీసి పాకిస్థాన్ బ్యాటింగ్‌ను బ్యాక్‌ఫుట్‌లోకి నెట్టాడు. బుమ్రా బౌలింగ్ తో పాక్ బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్ అక్షర్ పటేల్ రాణించాడు. పాకిస్థాన్ కీలక బ్యాటర్లను అవుట్ చేసి మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించేలా చేశాడు. వీరికి తోడు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీశాడు. 176 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ జట్టు భారత బౌలర్ల ధాటికి 114 పరుగులకే



కుప్పకూలింది. ఈ విజయంతో భారత్ తన గ్రూపులో అగ్రస్థానాన్ని నిలుపుకుంది. టీ20 వరల్డ్ కప్‌లో పాక్ పై భారత్ ఆధిక్యం 8-1కి పెరిగింది. భారత్ నెక్స్ట్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 18న నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో ఆడనుంది.

### 19 ఏళ్ల తర్వాత చరిత్ర సృష్టించిన ఇషాన్ కిషన్..!

టీ20 వరల్డ్ కప్‌లో దాయాది దేశాల మధ్య జరిగిన హై-వోల్టేజ్ పోరులో టీమిండియా ఘనవిజయం సాధించింది. భారత బౌలర్లు నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడటంతో.. పాక్ బ్యాటర్లు బెంబేలెత్తిపోయారు. ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయిన పాకిస్తాన్ జట్టును.. భారత్ 61 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి, తన అజేయమైన రికార్డును కొనసాగించింది. ముందుగా టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా క్రీజులోకి వచ్చారు. అయితే, అభిషేక్ డకౌట్ రూపంలో మొదటి ఓవర్లోనే ఔట్ అయ్యాడు. దీంతో పాక్ ప్లేయర్లు సంబరాలు చేసుకున్నారు. అయితే, వారి ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్ పాకిస్తాన్ బౌలర్లపై బ్యాటుతో విరుచుకుపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ హిస్టరీ క్రియేట్ చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2007 ఫైనల్ తరువాత పాకిస్తాన్ జట్టుపై హాఫ్ సెంచరీ బాదిన తొలి ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ చరిత్రకెక్కాడు. టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఆదివారం పాకిస్తాన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 40 బంతుల్లో 77 పరుగులు చేయడం ద్వారా ఈ ఘనత సాధించాడు. పాకిస్తాన్ జట్టుపై జరిగిన మ్యాచ్‌లో దూకుడుగా ఆడిన ఇషాన్ కిషన్ 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో గత 19 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు.

గత 19 ఏళ్లలో ఏ భారత ఓపెనర్ కూడా పాక్‌పై టీ20 ప్రపంచ కప్‌లో హాఫ్ సెంచరీ సాధించలేదు. చివరి సారిగా 2007 టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో గౌతమ్ గంభీర్ ఓపెనర్‌గా వచ్చి పాకిస్తాన్‌పై హాఫ్ సెంచరీ సాధించాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ భారత ఓపెనర్ హాఫ్ సెంచరీ సాధించలేదు. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్ ఓపెనర్లుగా బరిలోకి దిగినా పాకిస్తాన్ జట్టుపై 50 పరుగులు చేయలేక పోయారు. తాజాగా.. ఆ ఘనతను ఇషాన్ కిషన్ సాధించాడు.

# పరీక్షలకు వైభవ్ సూర్యవంశీ డుమ్మా!



టీమ్ ఇండియా అండర్-19 ప్రపంచ కప్ 2026 టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. గత ఏడాది నుంచి నిత్యం వార్తల్లో నిలుస్తున్నాడు ఈ టీనేజ్ సంచలనం. ఇటీవల వైభవ్ సూర్యవంశీ 10వ తరగతి పరీక్ష రాయబోతున్నాడని వార్త వచ్చింది. తాజా సమాచారం ప్రకారం వైభవ్ సూర్యవంశీ పరీక్షలకు హాజరు కావడం లేదు. ఈ విషయాన్ని క్రికెటర్ వైభవ్ తండ్రి స్వయంగా తెలిపారు. తాజ్‌పూర్ లోని మోడెస్టీ పాఠశాల ప్రిన్సిపాల్ ఆదర్శ్ కుమార్ అలియాస్ పింటూ మాట్లాడుతూ వైభవ్ సూర్యవంశీ తండ్రితో మాట్లాడిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ బిజీ షెడ్యూల్ కారణంగా వైభవ్ పరీక్షలు రాయలేకపోతున్నాడని, అయితే అతని ప్రిపరేషన్స్, ఎగ్జాట్ సెంటర్ సంబంధించిన అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యాయని ఆయన అన్నారు. మొదట తాను పరీక్షలకు హాజరు కావాలని బీసీసీఐని పర్మిషన్ అడిగాడని వార్తలు వచ్చాయి. కానీ అండర్ 19 టీం బిజీ షెడ్యూల్స్, మ్యాచ్‌లకు అందుబాటులో ఉండేందుకు టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ రాయడం లేదని తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం వైభవ్ సూర్యవంశీ ఎగ్జామ్ సెంటర్ పోద్దార్ ఇంటర్నేషనల్ స్కూల్, సమస్తిపూర్ లో ఉంది. స్కూల్ ప్రిన్సిపాల్ నీల్ కిషోర్ ఈ విషయాన్ని ధృవీకరిస్తూ వైభవ్ అడ్మిట్ కార్డు వచ్చిందని, అన్ని అవసరమైన డాక్యుమెంట్లు స్కూల్ యాజమాన్యం వద్ద భద్రంగా ఉంచామని చెప్పారు. వైభవ్ సాధారణ విద్యార్థిలాగే పరీక్షకు వస్తాడని, అతని కోసం ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని ఆయన స్పష్టం చేశారు.

# వ్యూవర్‌షిప్‌లో జియో హాట్‌స్టార్ ఆల్‌టైమ్ రికార్డ్!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్‌తో అధికార బ్రాడ్‌కాస్టర్ జియో హాట్‌స్టార్ పంట పండింది. ఈ మ్యాచ్‌లో భారత్ ఆధిపత్యం చెలాయించి మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించినా..వ్యూయర్‌షిప్‌లో మాత్రం సరికొత్త రికార్డ్ నమోదైంది. ఈ మ్యాచ్‌కు 45.4 కోట్ల కాన్‌కరెంట్ వ్యూస్ వచ్చాయని జియో హాట్‌స్టార్ అధికారికంగా ప్రకటించింది. క్రికెట్ చరిత్రలోనే ఇది సరికొత్త రికార్డ్. క్రికెట్ లైవ్ మ్యాచ్‌లు డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్ వేదికగా అందుబాటులోకి వచ్చాక వ్యూస్ విపరీతంగా పెరిగాయి.ఇప్పటి వరకు క్రికెట్ చరిత్రలో ఒకే సమయంలో అత్యధికంగా చూసిన మ్యాచ్ 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ (భారత్ జం ఆస్ట్రేలియా). దీనికి 5.9 కోట్ల లైవ్ కాన్‌కరెంట్ వ్యూస్ వచ్చాయి. అయితే జియో హాట్ స్టార్ తాజాగా ప్రకటించిన వ్యూస్. మ్యాచ్ మొదలైనప్పటి నుంచి చివరి వరకు వచ్చి వెళ్లిన మొత్తం జనాభా సంఖ్య. కానీ లైవ్ కాన్‌కరెంట్ వ్యూయర్‌షిప్ అంటే ఒకే సమయంలో లైవ్‌లో ఉన్నవారు. భారత్-పాక్ మ్యాచ్‌కు ఈ సంఖ్య 6 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ఆదివారం కొలంబో వేదికగా జరిగిన ఈ హైఓల్టేజ్ మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం చెలాయించి 61 పరుగుల తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై భారత్ 176 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగా.. పాకిస్థాన్ 114 పరుగులకే కుప్పకూలింది. ఈ భారీ విజయంతో గ్రూప్-ఏ నుంచి టీమిండియా సూపర్-8 బెర్త్ దక్కించుకోగా.. పాకిస్థాన్ తమ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. 61 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలవ్వడంతో పాకిస్థాన్ నెట్‌రన్‌రేట్ కూడా దెబ్బతిన్నది.ఈ మ్యాచ్ నేపథ్యంలో పాకిస్థాన్ బాయ్ కట్ డ్రామా ఆడింది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తామని ప్రకటించింది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఉత్కంఠ పెరిగింది. ఐసీసీ జోక్యంతో తలొగ్గి మ్యాచ్ ఆడింది. దాంతో ఈ మ్యాచ్‌కు విపరీతమైన క్రేజ్ పెరిగింది. మిస్టరీ స్పిన్నర్ ఉస్మాత్ తారిక్ విలక్షణమైన యాక్షన్ మ్యాచ్‌పై ఆసక్తిని రెట్టింపు చేసింది. కొలంబోలోని స్పిన్ కండిషన్స్‌కు తగ్గట్లు పాక్ జట్టులో ఆరుగురు స్పిన్నర్లు ఉండటంతో ఉత్కంఠ తప్పదని అంతా భావించారు. కానీ భారత్ ఆధిపత్యం ముందు పాకిస్థాన్ తేలిపోయింది. ఏ దశలోనూ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. దాంతో ఆ జట్టు ఘోర పరాజయం చవిచూసింది. ఒకవేళ ఈ మ్యాచ్ రద్దయి ఉంటే బ్రాడ్ కాస్టర్ జియో హాట్‌స్టార్ భారీ నష్టపోయేంది. కానీ బాయ్ కట్ డ్రామా హాట్‌స్టార్‌కు కలిసొచ్చింది. మ్యాచ్‌పై హైప్ క్రియేట్ చేసి వ్యూయర్‌షిప్ పెరిగేలా చేసింది.

# ఎట్టకేలకు బోణీ కొట్టిన అఫ్గానిస్థాన్

## యూఏఈపై అఫ్గాన్ ఘన విజయం

## అఫ్గాన్ సూపర్ 8 ఛాన్స్ సజీవం

టీ20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఈ టోర్నీలో తొలి రెండు మ్యాచ్‌లో ఓటమిపాలైన అఫ్గాన్, తాజాగా యూఏఈపై ఘన విజయం సాధించింది. యూఏఈ నిర్దేశించిన 161 పరుగుల టార్గెట్‌ను 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇబ్రహీం జర్దాన్ (53 పరుగులు), అజ్మతుల్లా ఒమర్జాయ్ (40లి పరుగులు) రాణించారు. యూఏఈ బౌలర్లలో జునైద్ సిద్ధిఖీ 2, మహ్మద్ అర్ఫాన్ చెరో 2, మహ్మద్ జువాదుల్లా 1 వికెట్ దక్కించుకున్నారు.తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో9 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. షోయబ్ ఖాన్ (68 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించగా, అలిశన్ షరఫు (40 పరుగులు) ఆకట్టుకున్నాడు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 4, ముజీబ్ అర్ రెహ్మాన్ 2, రషీద్ ఖాన్ 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ మ్యాచ్?లో అఫ్గాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్?లో అర్ఫాన్ వికెట్ తీయడంతో టీ20ల్లో 700 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్?గా నిలిచాడు. మొత్తం 513 టీ20ల్లో ఈ ఫీట్ అందుకున్నాడు. ఇందులో ఆయా దేశాల లీగులు, అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో కలిపి ఈ వికెట్లు సాధించాడు. టీ20 క్రికెట్?లో 700 వికెట్ల మైలురాయి అందుకున్న ఏకైక బౌలర్?గా రషీద్ నిలిచాడు. ఇందులో అంతర్జాతీయ టీ20ల్లో 191 వికెట్లు పడగొట్టాడు. అత్యధిక వికెట్లు తీసిన అఫ్గాన్ బౌలర్‌గానూ రషీద్ టాప్?లో కొనసాగుతున్నాడు. అటు ఐపీఎల్?లో అతడు 114 మ్యాచ్?ల్లో 158 వికెట్లు కూల్చాడు. ఇక ఓవరాల్‌గా రషీద్ తర్వాత ఈ లిస్ట్?లో వెస్టిండీస్ మాజీ క్రికెటర్ డ్వేన్ బ్రావో 631 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. అదే దేశానికి చెందిన సునీల్ నరైన్ 613 వికెట్లతో ఈ లిస్ట్‌లో మూడో స్థానంలో



కొనసాగుతున్నాడు. టీ20 వరల్డ్‌కప్ హిస్టరీలో 140ం పరుగుల ఛేదనలో అఫ్గాంకు ఘనమైన రికార్డేమీ లేదు. ఇప్పటిదాకా 15సార్లు 140ం పరుగుల ఛేదనలో దిగిన అఫ్గాన్, ఈ మ్యాచ్‌సహా విజయం సాధించింది కేవలం నాలుగు మ్యాచ్‌ల్లోనే. అత్యధికంగా 10సార్లు ఓడింది. ఈ టోర్నీలోనే సౌతాఫ్రికాతో మ్యాచ్ టై అయ్యింది. ఇక ప్రస్తుత టోర్నమెంట్‌లో గ్రూప్ డీలో ఉన్న అఫ్గాన్ తొలి మ్యాచ్?లో న్యూజిలాండ్‌ను ఢీ కొట్టింది. ఆ మ్యాచ్?లో 5 వికెట్ల తేడాతో ఓడింది. తర్వాత సౌతాఫ్రికాతో మ్యాచ్?లో గెలుపు అంచులదాకా వెళ్లి బోల్తా కొట్టింది. ఆ మ్యాచ్ డ్రా అవ్వడంతో సూపర్ ఓవర్?కు వెళ్లింది. అయితే సూపర్ ఓవర్ కూడా డ్రా అవ్వడంతో రెండోసారి సూపర్ ఓవర్ నిర్వహించాల్సి వచ్చింది. ఇక రెండో సూపర్ ఓవర్‌లో 5 పరుగుల తేడాతో సౌతాఫ్రికా నెగ్గింది. దీంతో అఫ్గాన్‌కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. టోర్నీలో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన పరిస్థితిలో యూఏఈపై విజయం సాధించి సూపర్ 8 ఆశలు సజీవంగా ఉంచుకుంది. గ్రూప్ దశలో అఫ్గాన్ తమ ఆఖరి మ్యాచ్?లో కెనడాను ఢీ కొట్టాల్సి ఉంది.

# ఇంగ్లాండ్‌ను వణికించిన ఇటలీ

## 24 పరుగుల తేడాతో ఓడిన ఇటలీ

## సూపర్ 8 రేసు నుంచి ఇటలీ నిష్క్రమణ.. సూపర్ 8కు చేరిన ఇంగ్లాండ్ జట్టు



టీ20 వరల్డ్‌కప్‌లో ఇంగ్లాండ్ మూడో విజయం నమోదు చేసి సూపర్ 8కు దూసుకెళ్లింది. గ్రూప్ దశలో భాగంగా సోమవారం ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో 24 పరుగుల తేడాతో నెగ్గింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 203 పరుగుల టార్గెట్‌ను ఇటలీ ఓవర్లన్నీ ఆడి 178 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బెన్ మనెంటి (60 పరుగులు, 25 బంతుల్లో) మెరుపు ఇన్నింగ్స్ వృథా అయ్యింది. ఇంగ్లాండ్ బౌలర్లలో శామ్ కరన్, జెమీ ఒవర్టన్ చెరో 3, జోఫ్రా ఆర్చర్ 2, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. విల్ జాక్స్ (53 పరుగులు, 22 బంతుల్లో) మెరుపు హాఫ్ సెంచరీ సాధించాడు. టామ్ బంటన్ (30 పరుగులు), ఫిల్ సాల్ట్ (28 పరుగులు), శామ్ కరన్ (25 పరుగులు), జాకబ్ బెతెల్ (23 పరుగులు) ఆకట్టుకున్నారు. ఇటలీ బౌలర్లలో గ్రాంట్ స్టీవార్ట్, క్రిషన్ కలుగమానే చెరో 2, జేజే స్మట్స్, అలీ హసన్, బెన్ మనెంటి తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ టోర్నీలో రెండో ఓటమితో గ్రూప్ సీ నుంచి ఇటలీ సూపర్ 8 రేసు నుంచి నిష్క్రమించింది. ఇప్పటిదాకా మూడు మ్యాచ్?లు ఆడగా, ఇటలీ ఒక మ్యాచ్ (నేపాల్?తో)లోనే నెగ్గింది. ఇక లీగ్ స్టేజ్?లో చివరిదైన నాలుగో మ్యాచ్ ఫిబ్రవరి 19న వెస్టిండీస్?తో జరగనుంది. ఈ గ్రూప్?లో ఇప్పటికే వెస్టిండీస్ సూపర్ 8కు అర్హత సాధించింది.



## ప్రగ్య జైశ్వాల్ రెడ్ హాట్ లుక్ వైరల్

ముంబై బ్యూటీ ప్రగ్య జైస్వాల్ నిరంతర సోషల్ మీడియా పోస్టులకు బోలెడంత ఫాలోయింగ్ ఉన్న సంగతి తెలిసిందే. లక్షలాదిగా ఫ్యాన్స్ తనను అనుసరిస్తున్నారు. తాజాగా ఈ బ్యూటీ పోస్ట్ చేసిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. ప్రగ్య షేర్ చేసిన -సర్వింగ్ సిట్రస్- ఫోటో షూట్ హాట్ టాపిగ్గా మారింది. ప్రగ్య తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆరెంజ్ కలర్ థై స్లిట్ డ్రెస్ ధరించి సెలయేటి పక్కన దిగిన ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలకు -పుల్లటి పండు అందిస్తున్నాను-- అని రాసింది. ఈ కొత్త లుక్ లో తన అందం, డ్రెస్సింగ్ స్టైల్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రగ్య మునుపటి కంటే ఈ లేటెస్ట్ లుక్ లో హాలిగా ఉందంటూ ప్రశంసలు కురుస్తున్నాయి.

కెరీర్ మ్యాటర్ కి వస్తే, ప్రగ్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఈ బ్యూటీ ఇటీవల అఖండ 2తో భారీ విజయం అందుకుంది. బాలయ్య-బోయపాటి కాంబినేషన్‌లో వచ్చిన ఈ భారీ సీక్వెల్‌లో తన నటనకు చక్కని పేరొచ్చింది. తదుపరి బాలీవుడ్ లో సీనియర్ నటుడు సన్నీడియోల్ సరసనా ఓ చిత్రంలో నటిస్తోందని సమాచారం.


ప్రగ్య పార్టీ లైఫ్ విషయానికి వస్తే, తనకంటూ మంచి స్నేహితుల బృందం ఉంది. ఇందులో మంచు లక్ష్మి, రకుల్ ప్రీత్ చాలా కాలంగా మంచి స్నేహితులు. ఆ ఇరు కుటుంబాలతో కలిసి ప్రగ్య సెలబ్రేట్ చేసుకున్న ఫోటోలు ఈడియోలు కూడా వైరల్ అయ్యాయి. స్నేహితులు కలిసి పార్టీలు చేసుకోవడం, జిమ్‌లో వర్కవుట్స్ చేయడం, విదేశీ పర్యటనలకు వెళ్లడం రెగ్యులర్ గా చూస్తున్నదే.మొత్తానికి ప్రగ్య తన గ్లామర్‌తో అటు సోషల్ మీడియాను, ఇటు సినిమాలతో బాక్సాఫీస్‌ను బ్యాలెన్స్ చేస్తోంది.

## ప్రమోషన్స్ పూర్తి చేసుకున్నాక టైటిల్ వివాదాలు




సినిమా ప్రమోషన్లన్నీ పూర్తి చేసుకున్నాక, సరిగ్గా సెన్సార్ సర్టిఫికేట్ వచ్చే సమయంలో టైటిల్ మార్చాల్సి రావడం నిర్మాతలకు పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా యంగ్ హీరో సుహాస్ నటించిన సినిమా కూడా ఇదే సమస్యను ఎదుర్కొంది. కేవలం సుహాస్ మాత్రమే కాదు, ఈ మధ్య కాలంలో మరికొన్ని చిన్న సినిమాలు కూడా సెన్సార్ అ÷-జబెక్షన్స్ వల్ల పేర్లు మార్చుకున్నాయి. సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'హే భగవాన్'. ఈ నెల 20న విడుదలకు సిద్ధమైన ఈ సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దేవుడి పేరుతో ఉన్న టైటిల్ వల్ల కొన్ని వర్గాల సెంటిమెంట్స్ దెబ్బతినే అవకాశం ఉందని భావించిన బోర్డు, పేరు మార్చాలని సూచించింది. దీంతో మేకర్స్ చేసేదేమీ లేక చివరి నిమిషంలో టైటిల్‌ను 'హే బలవంత్!' గా మార్చారు. ప్రమోషన్లన్నీ పాత పేరుతోనే జరగడంతో ఈ మార్పు సినిమాపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని చిత్ర యూనిట్ ఆందోళన చెందుతోంది. ఇటీవల విడుదలైన 'వానర' చిత్రానికి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ చిత్రంలో కుల రాజకీయాలు మరియు సున్నితమైన అంశాలు ఉండటం, టైటిల్ ఏమో హనుమంతుడిని గుర్తు చేసేలా ఉండటంతో సెన్సార్ బోర్డు నో చెప్పింది. దీంతో ఈ సినిమాను 'వనవీర' పేరుతో విడుదల చేయాల్సి వచ్చింది. ప్రమోషన్ల కోసం ఖర్చు పెట్టిన డబ్బు, టైటిల్ రీచ్ అంతా వృథా అయిందని ఆ చిత్ర దర్శకుడు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శివ కందుకూరి నటించిన 'చాయ్ వాలా' సినిమాకు కూడా సెన్సార్ కష్టాలు తప్పలేదు. ఈ టైటిల్ వాడకూడదని బోర్డు పట్టుబట్టడంతో, చిత్ర యూనిట్ తమ వర్కింగ్ టైటిల్ అయిన 'నవాబ్ కేఫ్'ను ఖరారు చేసింది. తండ్రీ కొడుకుల మధ్య సాగే ఈ ఎమోషనల్ డ్రామా ఫిబ్రవరి 20న కొత్త పేరుతో థియేటర్లలోకి రానుంది. చిన్న సినిమాలకు టైటిల్ అనేది బ్రాండింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. ఇలాంటి సమయంలో సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న నిర్మాతలకు భారంగా మారుతున్నాయి.


# మార్చిలో రానున్న ఉస్తాద్ భగత్ సింగ్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృందం 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.

# 26న ఉదయ్‌పూర్‌లో రష్మిక, విజయ్‌ల పెళ్లి

## మార్చి4న హైదరాబాద్‌లో రిసిప్షన్ అంటూ ప్రచారం



టాలీవుడ్‌లో హిట్ ఫెయిర్ హీరో విజయ్ దేవరకొండ-హీరోయిన్ రష్మిక మందన్న పెళ్లి వార్తలు ఇప్పుడు మరింత జోరందుకున్నాయి. వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి పెళ్లి జరగనుందనే టాక్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని అందమైన నగరం ఉదయ్‌పూర్ లోని ఓ రాయల్ ప్యాలెస్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య సింపుల్‌గా పెళ్లి వేడుక జరపాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26 తేదీని ముహూర్తంగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. ఈ వేడుకను గోప్యంగా ఉంచేందుకు ఎంత ప్రయత్నించినా సోషల్ మీడియాలో సమాచారం లీక్ అవుతూనే ఉండటం గమనార్హం. పెళ్లి వేడుక ఉదయ్‌పూర్‌లో సాదాసీదాగా జరిగినా, అసలు హంగామా మాత్రం హైదరాబాద్ లోనే ఉండబోతుందని టాక్. మార్చి 4న నగరంలోని ప్రముఖ వేదికలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరవుతారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల విజయ్ దేవరకొండ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆహ్వాన పత్రిక అందించారనే ప్రచారం ఈ పెళ్లి వార్తలకు మరింత బలం చేకూర్చింది. తాజాగా విజయ్ దేవరకొండ వెడ్డింగ్ కార్డ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇది చాలా సింపుల్‌గా కనిపిస్తుంది. ఈ ఇన్విటేషన్ ప్రకారం వారి వివాహం ఫిబ్రవరి 26న వివాహవం జరగనుందని అర్థమవుతుంది. రష్మిక - విజయ్‌లతో కలిసి పని చేసిన దర్శకులు, టెక్నీషియన్లు, సన్నిహితులు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సెలబ్రిటీ వెడ్డింగ్ రిసెప్షన్‌కు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, స్టార్ హీరోలు హాజరవుతారనే అంచనాలు ఉన్నాయి.

## ఫౌజీ షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం



ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్ర బృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించ నున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463